నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
12 | వరంగల్, మంగళవారం 4 మార్చి 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY

ఎస్సారెస్పీ కాలువను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పంటలు పరిశీలించి..
రైతులను ఓదార్చి

- అన్నదాతల ఫోన్‌కు తక్షణం స్పందించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి
- చుక్క నీరు లేక ఎడారిలా మారిన ఆకేరు వాగు
- సాగు నీరందక చేతికొచ్చే దశలో ఎండిపోతున్న వరి పొలాలు
- దయాకర్‌రావుకు గోడు వెళ్లబోసుకున్న రైతులు
- మంత్రి ఉత్తమ్, ఎస్సారెస్పీ, నీటిపారుదల శాఖ అధికారులకు ఫోన్
- నీరు విడుదల చేసి పంటలు కాపాడాలని ఎర్రబెల్లి విజ్ఞప్తి

పర్వతగిరి, మార్చి 3 : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం రావూరు గ్రామ శివారు ప్రాంత రైతులు సాగు నీరు లేక ఆగమవుతున్నారు. చుక్క నీరు లేక ఆకేరు వాగు ఎడారిలా మారగా, సాగునీరందక చేతికి వచ్చే దశలో ఉన్న వరి పంట కళ్ల ముందే ఎండిపోవడాన్ని చూసి ఆందోళన చెందుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో చేసేదేమీ లేక సోమవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకి ఫోన్ చేసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన రావూరు గ్రామానికి చేరుకొని ఆకేరు వాగులోని చెక్‌డ్యామ్, ఎండిపోతున్న వరి పంటను పరిశీలించారు. రైతుల సమస్యలు తెలుసుకొని వారిని ఓదార్చారు. అక్కడి నుంచే రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కూడా ఫోన్ చేసి పంటలు ఎండిపోయి దిక్కుతోచని స్థితిలో రైతులున్నారని, వారికి నీరందించేలా సహకరించాలని కోరారు. అలాగే నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ అనిల్‌కుమార్‌తో సైతం ఫోన్‌లో మాట్లాడి రైతులకు సాగు నీళ్లు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రైతులతో ఎర్రబెల్లి మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గంలో గతంలో ఎండాకాలం కూడా చెరువులు మత్తడి పడేవని, కాంగ్రెస్ రాగానే కష్టాలు మొదలయ్యాయన్నారు. ఆకేరు వాగు చెక్ డ్యామ్ ఎప్పుడూ నీటితో కళకళలాడేదని, దీనిపై ఆధారపడి కొత్తపల్లి, ల్యాబర్తి, బంధనపల్లి, కొత్తూరు, రోళకల్లు, రావూరు, పర్వతగిరి, కల్లెడ, అన్నారం, సోమారం, జమస్థాన్‌పురం, మడిపల్లి, గుర్తూరు రైతులు వేయి ఎకరాలకు పైగా పంటలు సాగుచేసేవారన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి రైతుల కోసం నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంట పరిశీలించేందుకు వచ్చిన ఎర్రబెల్లిని చూసి ఓ రైతు ఎదురుగా వచ్చి ఆయన కాళ్లకు దండం పెడుతుండగా ఆయన దగ్గరకు తీసుకొని ఓదార్చారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు మిగిలాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రబెల్లి వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ పంతులు, మాజీ సర్పంచులు మాలతీ సోమేశ్వర్‌రావు, బండి సంతోష్, ఆమడగాని రాజు, విజయ్, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, నాయకులు లక్ష్మీనారాయణ, గడ్డి యాకయ్య, శ్యామ్‌గౌడ్, చింతల శ్రీనివాస్, ఆమ్లానాయక్, నరేష్, రైతులు ఉన్నారు.



ఎర్రకుంట తండాలో ఎండిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే

- వెంటనే పొలాలకు సాగునీరందించాలి
- లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తాం
- పలు గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే పల్లా

జనగామ రూరల్, మార్చి3 : కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లే మిగిలాయని, పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క రోజు పంటలు ఎండిపోయిన సందర్భాలు లేవని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం జనగామ మండలంలోని ఎర్రకుంటతండా, దుబ్బ తండా, వడ్లకొండ, గానుగుపహాడ్ గ్రామాల్లో ఎండిన పంట పొలాలను పరిశీలించారు. రైతుల సాగు నీటి గోస విన్న ఆయన కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులకు అక్కడి నుంచే ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ పంట పొలాలకు వెంటనే సాగునీరు అందించాలన్నారు. లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. గతంలో కరంట్ పోకపోతే వార్త అని, ఇప్పుడు కరంట్ పోతే వార్త అని, గతంలో గంట కూడా కరంట్ పోలేదని, ఇప్పుడు ప్రతి అరగంటకు కరెంట్ పోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంవత్సర కాలంలోనే రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పాలనపై అవగాహన లేక ప్రాజెక్టుల ద్వారా నీళ్లు అందించలేక పోతున్నదన్నారు. ఇప్పటికైనా సర్కారు స్పందించి పంట పొలాలకు నీరందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పైరును చూసి రైతన్న కన్నీరు పెడుతున్నాడు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలో చెరువులు, చెక్‌డ్యాంల్లో నీరు లేకపోవడంలో భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో చుక్క నీరు రావడం లేదు. దేవాదుల నీరే ప్రధాన వనరుగా ఉన్నా, కాంగ్రెస్ సర్కారు కాల్వల్లో నేటికీ చుక్క నీరు విడుదల చేయకపోవడంతో పొట్టకొచ్చిన వరి చేన్లు ఎండిపోతున్నాయి. సగానికి సగం వరి చేన్లు జీవాలకు మేతగా మారుతున్నాయి. చేతికి రావాల్సిన పంట ఇలా పనికి రాకుండా పోవడంతో అన్నదాత గుండె పలిగి రోదిస్తున్నాడు. – దేవరుప్పుల, మార్చి 3

పొలం ఎండడంతో ఎడ్లను మేపుతున్న రైతు

- అడుగంటిన చెరువులు, చెక్‌డ్యాంలు
- భూగర్భ జలాలు తగ్గి పోయని బోర్లు
- దేవాదుల నీరే ప్రధాన వనరు
- దేవరుప్పుల మండలంలో నేటికీ చుక్క నీరు పారని కాల్వలు
- ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి వైఫల్యంతోనే ఈ దుస్థితంటున్న అన్నదాతలు

ఎండుతున్న పైరు.. రైతన్న కన్నీరు

యాసంగి ఆరంభంలో భూగర్భ జలాలు సంతృప్తికరంగా ఉండడంతో రైతులు వరి నాట్లు వేయడానికి మొగ్గు చూపారు. దీనికి తోడు ఏటా నవాబుపేట, స్టేషన్ ఘన్‌పూర్ రిజర్వాయర్ల నుంచి దేవాదుల నీరు కాల్వల ద్వారా వదులుతుండడంతో అదే భరోసాతో ఉన్నారు. మార్చి నాటికి కూడా కాల్వలు వదలకపోవడంతో చెరువులు, వాగులు ఎండి భూగర్భ జలాలు గణనీయంగా తగ్గాయి. మండలంలో ప్రధాన నీటి వనరులైన సింగరాజుపల్లి సింగరాయ చెరువు, వాగుపై ఉన్న 9 చెక్ డ్యామ్‌లు, కడవెండి తాళ్ల చెరువు, మాధాపురం గరిక చెరువు, దేవరుప్పుల గుడి చెరువు, చినమడూరు, పెదమడూరు, నీర్మాల చెరువుల్లో నీరు లేకపోవడం ఈ దుస్థితికి కారణమని రైతులు అంటున్నారు. దీంతో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లలో నీళ్లు బంద య్యాయి. ఇప్పటికే పంట పొలాలు దాదాపుగా ఎండగా రైతులు పశువులను మేపుతున్నారు. కొందరు గొర్రెలు మేపుకోవడానికి కాపరులకు అమ్ముకుంటున్నారు. మరి కొందరు గడ్డి కోసి పసుల మేతకు నిల్వ చేసుకుంటున్నారు. చేతికి రావాల్సిన పంట ఇలా ఎండు తుండడంతో రైతు కుటుంబాలు దిగులు పడుతున్నాయి. కొందరు రైతులు తమ బిడ్డలు పెండ్లిళ్ల కు ఉన్నారని, మరికొందరు అప్పులు తెచ్చి నాట్లు వేశామని కన్నీరు పెడుతున్నారు. నీటి కరువు తీర్చడానికి ప్రధాన వనరైన దేవాదుల నీరు తెప్పించడంలో స్థానిక ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి విఫలం కావడంతోనే ఈ దుస్థితి దాపురించిందని రైతులు చెప్పుకుంటున్నారు.

నోటికాడి బుక్క మట్టిల పడ్డట్టుంది

యాసంగి దినం 8 ఎకరాలు నాటు పెడితే ఏడెకరాలు ఎండింది. మూడు బోర్లు పోస్తలేవు. ఎకరానికి రూ. 20 వేల పెట్టుబడి పెట్టినం. కొంత పొలం ఈనింది. కొంత పొలం పొట్టకుంది. నోటి కాడి బుక్క మట్టిల పడ్డట్టుంది. పొలం అంతా ఎండుతున్నది. సింగరాయ చెరువుల నీళ్లుం టే మాబోర్లు పోసేది. ఇది పదేండ్ల సంది ఎప్పుడు ఎండలే. అదే నమ్మకంతో నాట్లు పెట్టినం. దేవాదుల కాల్వలు వదలకపోవడంతోనే చెరువుల నీళ్లు లేకుండ పోయినయి. ఇద్దరు బిడ్డలు పెండ్లికున్నరు. ఈ పంటతో బిడ్డ పెండ్లి చేయొచ్చని కలలు కన్నం. పొలం ఎండడంతో రందిప డుతున్నం. నా మొగడు లింగా రందితో ఆగమాగం చేస్తే దవాఖానకు తీసుకుపోయిన. డాక్టర్ గుండెపోటు వచ్చిందన్నడు. ఏదో బాధతోని ఉన్నడన్నడు. అప్పటి నుంచి పొలంకాడికి రానిస్తలే ను. నేనే చూసుకుంటున్న. పంటంత ఎండేటట్లున్నది. పసుల మేపుతున్నం.

– కున్సోత్ సరిత, రైతు, పచ్చర్లబాయి తండా

ఫీల్డ్ విజిట్

జనగామకు జలగండం

వడ్లకొండలో నీరు అందక ఎండిపోతున్న వరి పొలం

దేవరుప్పుల: నీరులేని కడవెండి చెక్‌డ్యామ్

జనగామకు జలగండం పొంచి ఉన్నది. యాసంగి సాగు వేళ జలం పాతాళానికి జారిపోయి రైతాంగాన్ని దిక్కుతోచని స్థితిలో పడేసింది. అటు దేవాదుల జలాలు సకాలంలో విడుదల చేయకుండా కాంగ్రెస్ సర్కారు జాప్యం చేయడం, అధికార యంత్రాంగం సైతం పట్టించుకోకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. జనవరిలో జిల్లాలో సరాసరి 7.26 మీటర్ల లోతు ఉన్న జలాలు ఫిబ్రవరి నాటికి 8.01కి పడిపోగా బచ్చన్నపేట లాంటి ప్రాంతాల్లో 9.16.. మరికొన్ని చోట్ల అత్యధికంగా 16.25 మీటర్ల ప్రమాదకర స్థాయికి చేరి డేంజర్ జోన్‌లోకి వెళ్తోంది. ఇలా రోజురోజుకూ భూగర్భ జలాలు అంతకంతకూ పడిపోతుండడంతో పదేళ్ల కిందట కరువు ఛాయలు మళ్లీ కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సాగునీటితో పాటు మరికొద్ది రోజుల్లో తాగునీటికీ తండ్లాడాల్సిన దుస్థితి వస్తుందని ప్రజల్లో ఆందోళన మొదలైంది. బీఆర్ఎస్ పాలనలో గోదావరి జలాలతో పుష్కలంగా పారడంతో తీరొక్క పంటలతో కోనసీమలా మారిన జనగామలో.. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యంతో అడునుకు చెరువులు, కుంటల్లోకి నీరు చేరక నేల నెర్రెలు బారి పంటలు ఎండిపోతుండడం రైతును మరింత అగాధంలో పడేసింది.

– జనగామ, మార్చి 3(నమస్తే తెలంగాణ)

- ప్రమాదస్థాయిలో 9.16 మీటర్ల నుంచి 16.25 మీ. లోతుకు నీరు
- అడుగంటిన చెరువులు, కుంటలు
- గోదావరి జలాల తరలింపులో జాప్యం
- మళ్లీ కరువు కోరల్లో జిల్లా రైతాంగం
- యాసంగి సాగుపై రైతుల్లో ఆందోళన
- సాగునీటి కోసం రోడ్డెక్కి రైతుల నిరసన
- క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే పల్లా పర్యటన
- పదేండ్లకు జిల్లాలో మళ్లీ కరువు ఛాయలు

జిల్లాలో భూగర్భ జలాల వివరాలు (మీటర్ల లోతులో)..

మండల	జనవరి	ఫిబ్రవరి
స్టేషన్‌ఘన్‌పూర్	9.05	11.57
జఫర్‌గడ్	13.04	14.75
నర్మెట	10.93	7.77
బచ్చన్నపేట	7.24	9.16
చిల్పూరు	6.35	6.85
దేవరుప్పుల	4.00	4.02
జనగామ	4.52	4.79
కొడకండ్ల	9.06	10.21
లింగాలఘనపురం	6.73	14.02
రఘునాథపల్లి	13.95	16.25
తరిగొప్పుల	7.19	9.02
పాలకుర్తి	3.62	3.92

జిల్లాలోని చెరువుల్లో నీటి నిల్వలు

చెరువులు	25శాతం	50శాతం	75శాతం
953	575	149	45

డేంజర్ జోన్‌లో భూగర్భ జలాలు | పాతాళంలోకి గంగమ్మ

బీఆర్ఎస్ పాలనలో నిండా గోదావరి జలాలతో జిల్లాలోని చెరువులు, కుంటలు కళకళలాడేవి. అప్పుడు ఎక్కడ బోరువేసినా కేవలం 30ఫీట్ల లోతులో గంగమ్మ ఉబికి వచ్చేది. కానీ ప్రస్తుతం భూగర్భజలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. ముఖ్యంగా బచ్చన్నపేట ప్రాంతంలో 9.16 మీటర్ల లోతుకు పడిపోగా, పడమటి కేశ్వాపూర్, పోచన్నపేట ప్రాంతంలో 8.13 నుంచి 8.15 మీటర్ల లోతుకు వెళ్లాయి. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలో 11.57, జనగామ మండలం సిద్దెంకి ప్రాంతంలో 15.66, కొడకండ్లలో 10.21, రఘునాథపల్లి మండలం మేకలగట్టులో 16.25, పాలకుర్తిలో 9.91, వల్మిడిలో 10.52, రఘునాథపల్లిలో 10.5, తరిగొప్పులలో 9.2, అక్కరాజుపల్లిలో 12.18, కూనూరులో 14.75 మీటర్ల లోతుకు పాతాళగంగ జారిపోయింది. 10 మీటర్ల లోతు వరకు పడిపోతే సంబంధిత శాఖ హెచ్చరికలు జారీ చేయాల్సి ఉంటుంది. మరికొద్ది రోజులు పరిస్థితి ఇలాగే ఉంటే రైతులు దారుణంగా నష్టపోవాల్సి వస్తుంది. జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 1.60 ఎకరాల్లో వరి వేయగా ఇప్పటికే సాగునీటి కటకటతో 30శాతం పంటలు ఎండిపోగా పదేళ్ల తర్వాత కరువు మళ్లీ తరుముకొస్తుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రిజర్వాయర్లలో నీటి మట్టం వివరాలు (క్యూబిక్ మీటర్లలో)

గ్రామం	రిజర్వాయర్ కేపాసిటీ	ప్రస్తుత నీటి మట్టం	శాతం
కన్నెబోయినగూడెం	0.120	11.590	9.66
అశ్వరావుపల్లి	0.740	322.000	43.51
నవాబుపేట	0.550	144.680	26.28
చీటకోడూరు	0.300	205.310	68.38
బొమ్మకూరు	0.198	108.770	54.93
గండిరామారం	0.400	246.405	61.60
ఆర్ఎస్ ఘన్‌పూర్	0.1570	600.000	38.22

సకాలంలో పంపింగ్ చేయక..

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జనగామ జిల్లాకు దేవాదుల నీటి పంపింగ్ ఆగిపోవడంతో జిల్లాలోని 7 రిజర్వాయర్లకు గానూ నర్మెట మండలం బొమ్మకూరు, లింగాలఘనపురం మండలం నవాబుపేట, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఆర్ఎస్ ఘన్‌పూర్, రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి జలాశయాల్లో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. వర్షపాతం తక్కువగా ఉండే జనగామ ప్రాంతంలో తెలంగాణ వచ్చిన తర్వాత దేవాదుల ప్రాజెక్టు నుంచి ఆయా రిజర్వాయర్లకు గోదావరి నీటిని పంపింగ్ చేసి కాలువల ద్వారా చెరువులు, కుంటలు, ఇతర చిన్ననీటి వనరులు నింపిడం వల్ల ఎండాకాలంలోనూ నిండుగా మారి భూగర్భజలాలు సంవృద్ధిగా ఉండేవి. ఎటుచూసినా పచ్చని పంటలతో రికార్డు స్థాయి ధాన్యం దిగుబడితో కోనసీమను తలపించిన జనగామ ఇప్పుడు ఎటు చూసినా నెర్రెలుబారి పొలాలు.. సగం ఎండిన వరి పంటలే కనిపిస్తున్నాయి. వ్యవసాయ బోర్లు, బావుల్లో నీటి జాడలు అడుగంటి వాటి ఆధారంగా వేసిన వరి పంటలు పొట్టదశలోనే ఎండిపోతున్నాయి. అదునులో మడులకు తడి అందక నెర్రెలువారి పైరు వాలిపోయి పచ్చటి పంటలు కళ్ల ముందే ఎండుతుంటే రైతు గుండె అవిసిపోతున్నది. పూర్తిగా ఎండిపోతే ఎందుకు పనికి రాదని చేసేది లేక పశువులు, జీవాలను మేతకు వదులుతున్నారు. మునుపెన్నడూలేని విధంగా సాగునీటి కోసం జిల్లాలో పలుచోట్ల రైతాంగం రోడ్డెక్కి ఆందోళన చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎండిన పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి గోదావరి జలాల తరలింపులో జాప్యంపై రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ఎండగడుతూ అధికారులను నిలదీస్తున్నారు.

జలవనరుల్లో 25శాతానికి పడిపోయిన నీటిమట్టం

జిల్లాలోని 12 మండలాల పరిధిలో 953 చెరువులు, కుంటల పరిధిలో 68,962 ఎకరాల ఆయకట్టు ఉంటే వాటిలో 575 వనరుల్లో నీటి మట్టాలు 25శాతానికి పడిపోయాయి. మరో 149 నీటి వనరుల్లో 50శాతం లోపు, ఇంకో 45 నీటి వనరుల్లో 75 శాతం నీరు ఉండగా వందకు పైగా చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు పూర్తిగా పడిపోయాయి. గతంలో 90 శాతానికి పైగా గ్రామాల్లో నీటి వనరులన్నీ దేవాదుల నీటితో నింపి పంటలకు సాగునీరందడం సహా భూగర్భజల నీటిమట్టం పెరిగి బోర్లు వేసినా.. బావులు తవ్వినా 30 నుంచి 100 ఫీట్ల లోపు నీటి జాడలు ఉబికివచ్చేవి. ప్రస్తుత యాసంగి సీజన్‌లో దేవాదుల నీటిని విడుదల చేయకపోవడంతో చెరువులు, కాల్వలు ఎండిపోయి, బోరు బావులు వట్టిపోయి వరి, మక్కజొన్న వంటి పంటలు ఎండిపోతున్నాయి. జిల్లాలోని గండిరామారం, బొమ్మకూరు, చీటకోడూరు, నవాబుపేట, ఆర్ఎస్ ఘన్‌పూర్, అశ్వరావుపల్లి రిజర్వాయర్లు సీజన్‌కు ముందు సకాలంలో నింపి వాటి ద్వారా చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేయడంలో అధికార కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. అదునులో పంటలకు సరిపడా తడులు అందిస్తే భూగర్భజలాలు సైతం లోతుకు పడిపోకుండా నిలకడగా ఉండేవని రైతులు చెబుతున్నారు. జనగామ, బచ్చన్నపేట, రఘునాథపల్లి, లింగాలఘనపురం, నర్మెట, చిల్పూరు, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గడ్ మండలాల్లో ఇప్పటికే వరి ఎండిపోయి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఏనాడూ సాగునీటి కటకట ఎరుగని రైతులు ఈసారి పెట్టుబడుల దక్కే పరిస్థితి లేకపోగా తమ కళ్ల ముందే పచ్చటి పంటలను పశువుల మేతకు కోసి వేయాల్సిన దుస్థితి నెలకొనడం కంట నీరు తెప్పిస్తున్నది. దేవాదుల ద్వారా రిజర్వాయర్లు నింపి అక్కడి నుంచి గ్రామాల్లోని చెరువులు, కుంటలకు నీటిని తరలిస్తే తప్ప యాసంగి సీజన్ గట్టెక్కేలా లేదు.

దేవరుప్పుల: అడుగుంటిన సింగరాయ చెరువు

పైపు లైన్ లీకేజీని సరి చేయిస్తున్న ఎంపీడీవో యాకయ్య

మధుతండా తాగునీటి సమస్య తీరింది

నమస్తే ఎఫెక్ట్

నర్సింహులపేట, మార్చి 3 : మధుతండావాసుల తాగునీటి సమస్య తీరింది. వారం రోజులుగా మిషన్ భగీరథ నీరందక నర్సింహులపేట మండలం రూప్లాతండా జీపీ పరిధిలోని మధుతండాలో ప్రజల తాగునీటి ఇబ్బందులపై సోమవారం 'నమస్తే తెలంగాణ'లో 'వాగు పారదు.. దూప తీరదు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో కె.యాకయ్య, మిషన్ భగీరథ ఏఈ వంశీలు మధుతండాలో పర్యటించారు. పైపులైన్ లీకేజీ లేకుండా ప్రతి ఇంటికి తాగునీరందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వారి వెంట జీపీ కార్యదర్శి మధు, మాజీ సర్పంచ్ లక్ష్మి, లక్ష్మణ్ శంకర్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ ముసలం

- ఎమ్మెల్యే కోటాలో పదవి కోసం పోటాపోటీ
- వేం నరేందరా.. భరత్‌చందర్‌రెడ్డా..?

మహబూబాబాద్, మార్చి 3 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్సీ పదవి కోసం మహబూబాబాద్ జిల్లా నుంచి పోటాపోటీ నెలకొంది. పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తున్నది. ముందు నుంచి కాంగ్రెస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పేరు దాదాపు ఖరారు కావచ్చని నాయకులు భావించారు. ఉన్నట్టుండి పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ స్వయంగా వెళ్లి పీసీసీ అధ్యక్షుడితో పాటు ఇతర పార్టీ పెద్దలను కలిసి భరత్‌చందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇవ్వాలని సూచించారు. దీంతో కాంగ్రెస్‌లో ముసలం పుట్టింది. సీఎం రేవంత్‌కు అత్యంత సన్నిహితుడు వేం నరేందర్‌రెడ్డిది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లి. ఇతను గతంలో 2004 నుంచి 2009 వరకు మానుకోట ఎమ్మెల్యేగా కొనసాగారు. 2010లో నిర్వహించిన ఉపఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. రేవంత్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న నరేందర్‌రెడ్డికి తాను సీఎం అయిన వెంటనే ఎమ్మెల్సీ ఇవ్వాలని చూసినా అధిష్ఠానం టికెట్ ఇవ్వకపోవడం ఆయనను నిరాశ పరిచింది. ఈ సారి ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవి కచ్చితంగా వస్తుందని వేం అనుచరులు ధీమాతో ఉన్నారు. తెరపైకి భరత్ చందర్ పేరు రావడంతో ఒకే జిల్లా నుంచి ఇద్దరిలో ఎవరికి ఇస్తారనేది ప్రశ్నగా మిగిలింది. ఎమ్మెల్సీ పదవికి పోటీ ఇలా ఉంటే కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి కోసం రేసులో ఒకరికంటే మరొకరు ముందున్నారు. భరత్‌చందర్‌రెడ్డి మళ్లీ జిల్లా అధ్యక్ష పదవి అడిగే అవకాశాలు కనిపించడం లేదు. ఒక వేళ భరత్‌చందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇస్తే అధ్యక్ష పదవి రేసులో మహబూబాబాద్ మండలం రెడ్యాల గ్రామానికి చెందిన వెన్నం శ్రీకాంత్‌రెడ్డితో పాటు కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి ఆశిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ నడుస్తున్నది.

టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కౌంటింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్వో ఇలా త్రిపాఠి

- మొత్తం 13,969 ఓట్లతో విజయం
- తొలి ప్రాధాన్యతలో 1,215 ఓట్లతో ముందంజ
- ఎలిమినేషన్ రౌండ్‌తో విజయం ఖరారు
- రెండోస్థానంలో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి
- గెలుపు కోటాగా 11,821 ఓట్లు
- చెల్లని ఓట్లు 494
- పీఆర్‌టీయూటీఎస్ నేతల సంబురాలు

నల్లగొండ ప్రతినిధి, మార్చి 3(నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఘన విజయం సాధించారు. ఆది నుంచి స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శిస్తూ తొలి ప్రాధాన్యతలో 1,215 ఓట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచి ఎలిమినేషన్ రౌండ్‌లోనూ స్పష్టమైన మెజార్టీ సాధించి మొత్తం 13,969 ఓట్లతో ఎమ్మెల్సీగా గెలుపొందారు. రెండో స్థానంలో యూటీఎఫ్ బలపర్చిన సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నిలిచారు.

నల్లగొండలోని ఐటీహబ్ వెనకాల ఉన్న గోదాముల్లో ఉదయం 8 గంటల నుంచి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ మొదలైంది. ముందుగా స్ట్రాంగ్ రూమ్ నుంచి బ్యాలెట్ బాక్స్‌లను కౌంటింగ్ హాల్‌కు తరలించారు. ఒక్కో టేబుల్‌కు 8 బాక్స్‌ల చొప్పున మొత్తం 25 టేబుళ్లపై 25 చొప్పున బ్యాలెట్ పత్రాలు కట్టలు కట్టే కార్యక్రమం పూర్తి చేశారు. ఉదయం 11 గంటల నుంచి ఒక్కో టేబుల్‌కు వేయి బ్యాలెట్ పేపర్ల చొప్పున తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. మొత్తం 19 మంది అభ్యర్థులకు పోలైన ఓట్లను వారికి కేటాయించిన బాక్స్‌లో వేశారు. చెల్లని ఓట్లను కూడా ఇదే సమయంలో కౌంటింగ్ ఏజెంట్ల అనుమతితో ప్రత్యేక బాక్స్‌లో వేశారు. మధ్యాహ్నం 3.30గంటల సమయంలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు వివరాలను అభ్యర్థుల వారీగా రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి ప్రకటించారు.

1,215 ఓట్ల ఆధిక్యంలో శ్రీపాల్‌రెడ్డి

తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిసే సరికి పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి 1,215 ఓట్ల ఆధిక్యత సాధించారు. మొత్తం పోలైన 24,135 ఓట్లలో 494 చెల్లనివిగా తేల్చారు. తొలి ప్రాధాన్యతలో శ్రీపాల్‌రెడ్డికి 6,035 ఓట్లు, యూటీఎఫ్ నర్సిరెడ్డికి 4,820, హర్షవర్ధన్‌రెడ్డికి 4,437, పూల రవీందర్‌కు 3,115, సరోత్తంరెడ్డికి 2,289, సుందర్‌రాజు యాదవ్‌కు 2,040 ఓట్లు వచ్చాయి. కొలిపాక వెంకటస్వామికి 421 ఓట్లు రాగా మిగతా వారు డబుల్ డిజిట్ దాటలేదు. చిలుక చంద్రశేఖర్‌కు కేవలం ఒకే ఓటు పోల్ కావడం గమనార్హం. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిశాక చెల్లని ఓట్లను పక్కన పెట్టి, మిగిలిన 23,641 ఓట్లలో 50 శాతం ప్లస్ ఒకటి కలిపి మొత్తం 11,821 ఓట్లను గెలుపు కోటాగా నిర్ధారించారు. అయితే తొలి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ అన్ని ఓట్లు రాకపోవడంతో ఎలిమినేషన్ రౌండ్‌ను ప్రారంభించారు. అతి తక్కువగా తొలి ప్రాధాన్యత వచ్చిన అభ్యర్థులను కింద నుంచి ఎలిమినేట్ చేస్తూ ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు లెక్కించారు. చివరిదైన నర్సిరెడ్డి ఎలిమినేషన్ రౌండ్ ముగిసే సరికి శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు రావడంతో ఆయనను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి విజేతగా ప్రకటించారు. దీంతో పీఆర్‌టీయూటీఎస్ నేతలు, శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు.